


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



గురువారం 30-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 42 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## పాక్ మంత్రి నోటిదురుసు




- పీఓకే నిరసనకారులపై ఘాటు విమర్శలు
- భారత్‌పై ఖవాజా ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- కాల్పులను సమర్థించిన పాక్ మంత్రి
- వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ఆగ్రహం
- పీఓకే ఉద్రిక్తతపై కొత్త వివాదం

## జపాన్‌లో భారీ భూకంపం




- కుప్పకూలిన ఈయాన్ షాపింగ్ మాల్
- 13 మంది మృతి.. వందల మందికి గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- రహదారులు, వంతెనలు ధ్వంసం
- సహాయక చర్యలు ముమ్మరం
- ఆఫ్టర్‌షాక్స్‌తో ప్రజలు భయాందోళన



# కేంద్రం కొత్త కొరడా!

- యూసీ ఉంటేనే నిధుల విడుదల
- నిధుల మళ్లింపుపై కేంద్రం కఠినం
- ఖర్చు లెక్కలకే గ్రీన్ సిగ్నల్
- డైవర్షన్‌కు కేంద్రం చెక్
- పథకాలు అమలైతేనే ఫండ్స్
- ప్రత్యేక ఖాతాలతో పర్యవేక్షణ
- రూ.5 వేల కోట్లలో రూ.3 వేల కోట్లే ఖర్చు
- కేంద్ర నిధులపై రేవంత్ ఫోకస్
- అధికారుల నిర్లక్ష్యంపై హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** రాష్ట్రాలకు విడుదల చేసే నిధులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాలు.. కేంద్రం రూపొందించిన, వారి లక్ష్యానికి అనుగుణంగా ఉండే పథకాల కోసం కాకుండా ఇతర వాటికి నిధులను మళ్లిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలోనే వివిధ పథకాల కోసం కేంద్రం మొదట నిధులను మంజూరు చేస్తుంది.. కానీ విడుదల చేయదు. ఆ నిధులను ఖర్చు చేశాక రాష్ట్రాలు పంపించే 'యుటిలైజేషన్ సర్టిఫికేట్' (యూసీ) సమర్పించాకే నిధులు విడుదల చేయాలని కొత్త షరతు విధించింది. కేంద్రంలో మోడీ ప్రధాని అయ్యాక ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగంలో క్రమక్రమంగా అనేక సంస్కరణలను కేంద్రం తీసుకువస్తుంది.

**క్షేత్రస్థాయిలో పథకాలు అమలయ్యాకే..**

కొంతకాలం క్రితం వరకు కేంద్రం నిధులను మంజూరు చేసిన తర్వాత రాష్ట్రం తన వాటా నిధులను అకౌంట్లో జమ చేసేది. అనంతరం కేంద్రం నిధులను విడుదల చేసేది. దీంతో కేంద్ర రాష్ట్రాల సంయుక్త నిధులను కలిపి ఒకేసారి పథకాల వినియోగం కోసం ఖర్చు చేసేవారు.

మిగతాది 2 లో..

# తల్లికి వందనంలో సైబర్ మోసం

- 28 ఖాతాల్లో డబ్బు మాయం
- సిమ్ సేల్స్ పర్సన్ అరెస్ట్
- ఆధార్ వివరాల దుర్వినియోగం
- సైబర్ మోసగాళ్ల కొత్త ఎత్తుగడ
- పోలీసుల అప్రమత్త హెచ్చరిక




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** వారం రోజుల క్రితం ఏపీ ప్రభుత్వం అర్హుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం కింద నిధులు జమ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ స్కీమ్‌లో సైబర్ మోసం జరిగింది.

# నిత్యావసరాలపై భారీ భారం

- ఆగస్టు నుంచి ధరల మోత
- ఎలక్ట్రానిక్స్ ధరల పెంపు
- కార్లు మరింత ఖరీదు
- మధ్యతరగతికి మరో షాక్
- ప్రపంచ మార్కెట్ ప్రభావం




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో ఇప్పటికే చాలా వస్తువుల ధరలు పెరిగాయి.. ఇక ఆగస్టు 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలకు మరోసారి ద్రవ్యోల్బణం షాక్ ఇవ్వనుంది. నిత్యావసర వస్తువుల నుంచి ఎలక్ట్రానిక్స్, కార్ల వరకు పలు ఉత్పత్తుల ధరలు పెరగనున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# కర్ణాటకలో హెచ్ఐవీ కలకలం




- 7 వేల మంది విద్యార్థులకు పాజిటివ్
- ప్రభుత్వం అత్యవసర చర్యలు
- విద్యాసంస్థల్లో ఉచిత పరీక్షలు
- ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు
- అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- యాంటీ లీక్ బిల్లు ఆమోదం
- 10 ఏళ్ల జైలు శిక్ష
- రూ.5 కోట్ల జరిమానా
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు గ్రీన్‌సిగ్నల్
- విద్యార్థుల భవిష్యత్ రక్షణ




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' విపక్షాల గందరగోళం నడుమ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. బిల్లు ఆమోదం అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నేటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

ఇక నిందితులకు కఠిన జైలు శిక్ష..

ఇక నుంచి పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యక్తులు, గ్యాంగ్‌లు, అధికారులకు విధించే కనీస జైలు శిక్షను 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా బిల్లును రూపొందించారు. పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీలు, సంస్థలు, ముఠాలకు రూ.5 కోట్ల వరకు భారీ జరిమానా విధించడంతో పాటు, ఆ పరీక్ష నిర్వహణకు అయిన మొత్తం వ్యయాన్ని వారి నుంచే వసూలు చేయనున్నారు. పేపర్ లీక్ కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఈ కేసుల విచారణను 2 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

# నీట్ లీక్ కేసులో సీబీఐ తొలి చార్జ్‌షీట్

- 13 మంది నిందితులపై కేసు నమోదు
- పట్నా ప్రత్యేక కోర్టులో దాఖలు
- పేపర్ లీక్ ముఠా నెట్‌వర్క్ బట్టబయలు
- క్రిమినల్ కుట్రతో పాటు పలు అభియోగాలు
- మరిన్ని చార్జ్‌షీట్లు దాఖలు చేయనున్న సీబీఐ
- దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది

2 లో

# మోడీ సర్కార్‌కు కొత్త సవాల్?

- రైతు ఉద్యమానికి సన్నాహాలు
- టికాయత్‌తో అశుతోష్ భేటీ
- రైతు-విద్యార్థి ఐక్యం
- సంయుక్త పోరాట వ్యూహం
- దేశవ్యాప్తంగా ఉద్యమ సంకేతాలు




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** ఇటీవల దేశంలో సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ రైతు ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్టు సమాచారం. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి ముట్టడించి, తీవ్ర ఒత్తిడికి గురిచేయాలనే వ్యూహంలో భాగంగా భారతీయ కిసాన్ యూనియన్ అగ్రనేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నాయకుడు అశుతోష్ సమావేశమయ్యారు. రైతులు, విద్యార్థుల మధ్య ఒక బలమైన సంయుక్త వేదికను ఏర్పాటు చేసే దిశగా ఈ భేటీ జరిగినట్టు తెలుస్తోంది.

2020-21 నాటి చారిత్రాత్మక రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రాకేశ్ టికాయత్‌తో, సీజేపీ నేతలతో సమావేశం కావడం జాతీయ స్థాయిలో ఆసక్తిని రేకెత్తించింది.

# టెలిగ్రామ్‌పై ఉగ్రవాద ఆరోపణలు

- దురోవ్‌పై రష్యా క్రిమినల్ కేసులు
- మోస్ట్‌వాంటెడ్ జాబితాలో పేరు?
- రష్యా చర్యలపై దురోవ్ ఆగ్రహం
- సైబర్ నేరాల కేసులో కీలక మలుపు
- టెలిగ్రామ్‌కు పెరుగుతున్న చట్టపరమైన సవాళ్లు
- దురోవ్ వ్యవహారంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ

2 లో

# పారదర్శక పాలనకు కొత్త అడుగు

- కేబినెట్ ఆమోదించిన 5 సంస్కరణలు
- అక్రమాలకు అడ్డుకట్టే లక్ష్యం
- ప్రభుత్వ సేవలకు డిజిటల్ బలం
- శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం
- ప్రాజెక్టుల పర్యవేక్షణ మరింత పటిష్ఠం
- త్వరిత సేవలపై ప్రభుత్వ ఫోకస్

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 30-07-2026

# నీట్ లీక్ కేసులో సీబీఐ తొలి చార్జ్‌షీట్




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్-యూజీ పేపర్ లీక్ కేసు విచారణలో కేంద్ర దర్యాప్తు సంస్థ కీలక అడుగు వేసింది. ఈ వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించిన 13 మంది నిందితులపై తొలి చార్జిషీట్‌ను ఇవాళ సీబీఐ దాఖలు చేసింది. ఈ మేరకు బాధ్యులపై క్రిమినల్ కుట్ర, మోసం, విశ్వాస ఘాతుకం, సాక్ష్యాలను తారుమారు చేయడం వంటి తీవ్రమైన బీఎన్ఎస్, ఐపీసీ సెక్షన్ల కింద సీబీఐ చార్జిషీట్ తయారు చేసింది. పాట్నాలోని ప్రత్యేక సీబీఐ కోర్టులో ఈ ఫస్ట్ చార్జిషీట్‌ను సమర్పించారు.

ముఠా నెట్‌వర్క్ బట్టబయలు..

కేసు విచారణలో భాగంగా బీహార్, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో విస్తరించిన ముఠా నెట్‌వర్క్, ప్రశ్నపత్రాల చోరీ, అభ్యర్థులకు జవాబులు అందించడం వంటి అంశాలపై సేకరించిన పక్కా ఆధారాలను సీబీఐ కోర్టుకు అందించింది. ఇప్పటికే పేపర్ లీక్ ముఠా సభ్యులు, మధ్యవర్తులు, విద్యార్థులు, హాస్టల్ నిర్వాహకులతో సహా పలువురిని సీబీఐ ఇప్పటికే అరెస్టు చేసింది. ఈ కేసుపై పట్నా కోర్టులో తదుపరి విచారణ కొనసాగనుంది. దర్యాప్తు ఇంకా పూర్తికానందున, మిగిలిన నిందితులపై త్వరలోనే అనుబంధ చార్జిషీట్లను దాఖలు చేయనున్నట్లుగా సీబీఐ వర్గాలు తెలిపాయి.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి**

కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి కొత్తగా ఏర్పాటు చేసే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో రోజువారీ ప్రాతిపదికన విచారణ జరుగుతుంది. అదేవిధంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి జరిగే పెద్ద ఎత్తున పరీక్షల మోసాలను విచారించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. అక్రమాలకు బాధ్యులైన పరీక్షా నిర్వహణ ఏజెన్సీలపై నిషేధ కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచారు. ఇటీవల నీట్ వంటి పోటీ పరీక్షల్లో చోటుచేసుకున్న వివాదాలు, దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో కేంద్రం ఈ చట్టాన్ని బలపరిచింది. విద్యార్థుల భవిష్యత్తును, విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఇదొక కీలక అడుగు అని ప్రభుత్వం పేర్కొనగా, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనంపై లోక్‌సభలో విస్తృతంగా చర్చ జరిగిన విషయం తెలిసిందే.

# కర్ణాటకలో హెచ్‌ఐవీ కలకలం



**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులకు సంబంధించి కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన ఒక సంచలనాత్మక నివేదిక తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని యువత, ముఖ్యంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హెచ్‌ఐవీ బారిన పడుతున్నట్లు ఆరోగ్య శాఖ నిర్వహించిన సర్వేల్లో బహిర్గతమైంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన వివిధ హెల్త్ అవేర్నెస్ క్యాంపెయిన్లలో భాగంగా సేకరించిన నమూనాలను విశ్లేషించగా, రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 7,000 మంది విద్యార్థులు హెచ్‌ఐవీ పాజిటివ్‌గా తేలినట్లు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంత చిన్న వయస్సులోనే వేలాది మంది విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడటం పట్ల ఆరోగ్య నిపుణులు, తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఆందోళనకర పరిస్థితులను సీరియస్‌గా తీసుకున్న కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్రంలో హెచ్‌ఐవీ వ్యాప్తిని ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఉచిత పరీక్షా శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులతో పాటు, హెచ్‌ఐవీ వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ మార్గాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆరోగ్య శాఖకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలోనే ఈ ప్రత్యేక డ్రైవ్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఆరోగ్య, విద్యా శాఖల అధికారులు సమాయత్తమవుతున్నారు.

# పారదర్శక పాలనకు కొత్త అడుగు



**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** కేరళ రాష్ట్రంలో ప్రభుత్వ పాలనను మరింత బలోపేతం చేయడం, పారదర్శకతను పెంచడం, ఏళ్లుగా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే కేరళ మంత్రి మండలి బుధవారం 5 కీలకమైన సుపరిపాలనా (గవర్నెన్స్) సంస్కరణలకు ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీ అనంతరం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నూతన సంస్కరణల ద్వారా ప్రభుత్వ ప్రాజెక్టుల పర్యవేక్షణ, సేవలు, ఫైళ్ల నిర్వహణ కోసం ఒక సమగ్రమైన డిజిటల్ నెట్‌వర్క్, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని సీఎం తెలిపారు.

ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, నిర్ణయాలు త్వరితగతిన తీసుకునేలా చూడడమేనని పరిపాలనా వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టులలో అనవసర జాప్యాలను నివారించడం, నిధుల వినియోగంలో పారదర్శకత తీసుకురావడం ద్వారా రాష్ట్రాదాయంలో జరుగుతున్న నష్టాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ సాంకేతికతను జోడించి తీసుకువస్తున్న ఈ నూతన సంస్కరణలతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, సులభంగా అందుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోడీ సర్కార్‌కు కొత్త సవాల్?



**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** ఇటీవల దేశంలో సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ రైతు ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్టు సమాచారం. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి ముట్టడించి, తీవ్ర ఒత్తిడికి గురిచేయాలనే వ్యూహంలో భాగంగా భారతీయ కిసాన్ యూనియన్ అగ్రనేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నాయకుడు అశుతోష్ సమావేశమయ్యారు. రైతులు, విద్యార్థుల మధ్య ఒక బలమైన సంయుక్త వేదికను ఏర్పాటు చేసే దిశగా ఈ భేటీ జరిగినట్టు తెలుస్తోంది.

2020-21 నాటి చారిత్రాత్మక రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రాకేశ్ టికాయత్‌తో, సీజేపీ నేతలతో సమావేశం కావడం జాతీయ స్థాయిలో ఆసక్తిని రేకెత్తించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి ఘటనలపై భగ్గుమంటున్న విద్యార్థి ఆందోళనలకు.. కనీస మద్దతు ధర చట్టబద్ధత, రైతుల ఆదాయం పెంపు వంటి దీర్ఘకాలిక వ్యవసాయ సమస్యలను అనుసంధానం చేసి ఒక ఉమ్మడి పోరాటాన్ని నిర్మించడంపై వీరు ప్రధానంగా చర్చలు జరిపారు. ఈ రెండు వర్గాల కలయిక భవిష్యత్తులో దేశవ్యాప్తంగా కేంద్రానికి వ్యతిరేకంగా ఒక భారీ 'విద్యార్థి-రైతు సంయుక్త ఉద్యమానికి' దారితీస్తుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# టెలిగ్రామ్‌పై ఉగ్రవాద ఆరోపణలు




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** 'టెలిగ్రామ్' వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ పై రష్యా ప్రధాన భద్రతా సంస్థ తీవ్రమైన క్రిమినల్ అభియోగాలు నమోదు చేసినట్లు తెలుస్తుంది. ఆయన "ఉగ్రవాదానికి సహకరిస్తున్నారని" ఆరోపిస్తూ అంతర్జాతీయ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు అసోసియేటెడ్ ప్రెస్ వెల్లడించింది. రష్యాలో విధ్వంసక చర్యలు, ఉగ్రవాద దాడులు, సైబర్ నేరాలకు సంబంధించి ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, తీవ్రవాద సంస్థలు ఉపయోగిస్తున్న అనేక ఛానెళ్లు, చాట్‌లు, బాట్‌లను తొలగించడంలో టెలిగ్రామ్ యాజమాన్యం విఫలమైందని ఆరోపిస్తూ ఈ చర్యలు చేపట్టినట్లు రష్యా అధికారులు స్పష్టం చేశారు.

మరోవైపు, రష్యా ప్రభుత్వం తన పౌరుల భావప్రకటన స్వేచ్ఛను, వ్యక్తిగత గోప్యతా హక్కులను అణచివేసేందుకే టెలిగ్రామ్‌పై ఆంక్షలు విధిస్తూ తనపై అబద్ధపు కేసులు బనాయిస్తుందని పావెల్ దురోవ్ ఇదివరకే ఖండించారు. ఇటీవలి కాలంలో రష్యా ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్ పై పరిమితులు పెంచుతున్న నేపథ్యంలో ఈ అభియోగాలు నమోదు కావడం గమనార్హం. ప్రస్తుతం రష్యా అధికారికంగా నమోదు చేసిన కేసుల నేపథ్యంలో పావెల్ దురోవ్‌పై రష్యాతో పాటు ఇతర ప్రాంతాల్లో చట్టపరమైన సవాలు పెరిగినట్లయింది. కాగా ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉండగా.. టెలిగ్రామ్ అధినేత పావెల్ దురోవ్ ను మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చడంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# పాక్ మంత్రి నోటిదురుసు

**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తన నోటి దురుసుతో భారత్‌పై వివాదాస్పద, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకే)లో తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్న పౌరులకు, భారత్‌కు మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదని ఆయన వ్యాఖ్యానించారు. పిఓకే నిరసనకారులను 'పాకిస్తాన్ శత్రువులు గా అభివర్ణించిన ఆసిఫ్, వారితో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై పాక్ సైన్యం జరిపిన కాల్పులను ఆయన బహిరంగంగా సమర్థించుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఖవాజా ఆసిఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పిఓకే ప్రజలను భారత్‌తో పోల్చడం ద్వారా, "భారత్- పిఓకే ఒకటే" అని తాము ఎప్పటినుంచో చెప్తున్న మాటను పాక్ మంత్రి స్వయంగా అంగీకరించారని నెటిజన్లు ఆయనకు ఘాటుగా కౌంటర్ ఇస్తున్నారు. సొంత ప్రజల డిమాండ్లను పరిష్కరించడం చేతకాక, ఆందోళనకారులపై దాడులు చేస్తూ భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్ అలవాటుగా మారిందని పలువురు మండిపడుతున్నారు.

# జపాన్‌లో భారీ భూకంపం



**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** జపాన్‌లో మంగళవారం సంభవించిన భారీ భూకంపం ధాటికి అనేక నగరాల్లో ఊహించని రీతిలో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించాయి. అధికారిక సమాచారం ప్రకారం ఈ విపత్తులో ఇప్పటివరకు 13 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ భూకంప తీవ్రతకు కషిమా పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ప్రముఖ 'ఈయాన్ మాల్' భూకంప ప్రకంపనల ధాటికి తీవ్రంగా దెబ్బతిని కుప్పకూలింది. ఈ భయంకర దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, పేలుడు సమయానికి మాల్ శిథిలాల కింద దాదాపు వందలాది మంది పర్యాటకులు, కొనుగోలుదారులు, సిబ్బంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఈ నిర్మాణం కేవలం భూకంప ప్రకంపనల వల్లే కూలిపోయిందా లేక అంతర్గత గ్యాస్ లీకేజీ ప్రధాన కారణమా అనే కోణంలో నిపుణుల బృందాలు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నాయి.

భూకంపం యొక్క ధాటికి పలు ప్రధాన నగరాల్లో రహదారులు నిలువునా పగిలిపోవడం, కీలకమైన వంతెనలు దెబ్బతినడం, భవనాలు నేలమట్టం కావడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో సహాయక బృందాలు ఘటనా స్థలాలకు చేరుకోవడం సవాలుగా మారింది. విద్యుత్ లైన్లు, తాగునీటి వ్యవస్థలు ఛిన్నాభిన్నం కావడంతో లక్షలాది మంది చీకటిలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. భూకంపం తర్వాత కూడా వరుసగా బలమైన ప్రకంపనలు వస్తుండటంతో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.

# తల్లికి వందనంలో సైబర్ మోసం

**మొదటి పేజీ తరువాయి**

28 మంది ఖాతాల్లో నుండి ఎయిర్ టెల్ సిమ్ సేల్స్ పర్సన్ డబ్బులు కొట్టేశాడు. ఈ ఘటన కర్నూల్ లో చోటు చేసుకుంది. ఎయిర్ టెల్ సిమ్ కంపెనీలో సేల్స్ పర్సన్ గా చేస్తున్న కేటుగాడు సిమ్ అమ్మేటప్పుడు బాధితుల ఆధారాలు సేకరించాడు. బాధితుల వేలిముద్రలు, అకౌంట్ వివరాలను నమోదు చేసుకున్నాడు. ఆ వివరాలతో వారి అకౌంట్ నుండి డబ్బులు విత్ డ్రా చేసుకున్నాడు.

ఖాతాలోని డబ్బు ఎలా మాయమైందో తెలియక బాధితులు ఆందోళన చెందారు. చివరికి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డబ్బులు డ్రా చేసిన నిందితులు ఉపేంద్ర, వీరారెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే తల్లికి వందనంలో సైబర్ మోసాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి మోసాలు జరిగాయి. దీంతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే మోసపూరిత లింకులను ఓపెన్ చేయవద్దని చెబుతున్నారు. బ్యాంక్ ఖాతా, ఓటీపీ, ఆధార్ కార్డ్ ఇతర వివరాలను బయటపెట్టవద్దని హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థినులతో మసాజ్.. టీచర్‌పై విచారణ



**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** విద్యార్థులకు విద్యను బోధించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయురాలే బాధ్యత మరిచి ప్రవర్తించారు. రూపా అనే ఉపాధ్యాయురాలు విద్యార్థిలతో తన ఒళ్లు మసాజ్ చేయించుకోవడం, కాళ్లు పట్టించుకోవడం వంటి పనులకు పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నంబుళపూలకుంట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జరిగింది. పాఠశాల వేళల్లో రూపా అనే ఉపాధ్యాయురాలు తన వ్యక్తిగత సేవలకు విద్యార్థులను వాడుకున్నారు. ఈదృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. దీంతో ఉపాధ్యాయురాలు రూపా నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెచ్చేలా రూపా వ్యవహరించిన తీరును చూసిన నెటిజన్లు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే టీచర్ రూపా వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తీవ్రంగా స్పందించారు. పూర్తి విచారణ జరిపి సదరు టీచర్‌పై తగిన శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు

# నిత్యావసరాలపై భారీ భారం

**మొదటి పేజీ తరువాయి**



దీంతో మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై మరింత భారం పడే అవకాశం ఉంది... మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలు 6 నుంచి 8 శాతం వరకు పెరగవచ్చు. ముఖ్యంగా టీ, హెయిర్ ఆయిల్, సబ్బులు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పెరుగుతున్న జీవన వ్యయంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది మరో ఆర్థిక భారం కానుంది.

ఇక, ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా ధరల పెరుగుదల కనిపించనుంది. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, టెలివిజన్ల ధరలు 4 నుంచి 6 శాతం వరకు పెరగవచ్చని అంచనా. అంతర్జాతీయ మార్కెట్‌లో మెమరీ చిప్‌ల ధరలు భారీగా పెరగడంతో స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. ఆటోమొబైల్ రంగంలోనూ ధరల పెంపు తప్పదని కంపెనీలు ఇప్పటికే సంకేతాలు ఇచ్చాయి. ముడిసరుకుల ధరలు పెరగడంతో తయారీ వ్యయం అధికమైందని పేర్కొంటూ మారుతి సుజుకి ఆగస్టు నుంచి కొన్ని మోడళ్లపై రూ.30,000 వరకు ధరలు పెంచనున్నట్లు ప్రకటించింది. హోండా కార్స్, మెర్సిడెస్-బెంజ్ వంటి కంపెనీలు కూడా త్వరలోనే ధరలను సవరించే అవకాశం ఉంది.

ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు ప్రపంచ మార్కెట్ పరిస్థితులేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముడి చమురు, పామాయిల్ ధరల పెరుగుదల, ప్యాకేజింగ్ మెటీరియల్ ఖర్చులు అధికమవడం, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీశాయి. సముద్ర రవాణా వ్యయం పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువలో హెచ్చుతగ్గులు కూడా దిగుమతి ఖర్చులను పెంచుతున్నాయి.

కంపెనీలు ఒకేసారి కాకుండా దశలవారీగా ధరలు పెంచనున్నట్లు తెలిపాయి. మొదట ప్రీమియం ఉత్పత్తులపై ధరలు పెంచి, తర్వాత చిన్న ప్యాకేజీల ధరలను సవరించే అవకాశం ఉంది. జూన్ త్రైమాసికంలో నష్టాలను పూర్తిగా వినియోగదారులపై మోపలేదని, మిగిలిన భారాన్ని సెప్టెంబర్ త్రైమాసికంలో మరో 2 నుంచి 5 శాతం వరకు ధరల పెంపు ద్వారా భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వస్త్ర కంపెనీలు కూడా కొత్త సీజన్ దుస్తుల ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ పరిస్థితులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని, జీడీపీ వృద్ధి రేటుపైనా ప్రభావం పడొచ్చని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పరిమిత ఆదాయంతో జీవిస్తున్న మధ్యతరగతి కుటుంబాలకు ఉదయం టీ నుంచి కొత్త కారు కొనుగోలు వరకు ప్రతి ఖర్చు పెరగడంతో రాబోయే పండుగ సీజన్‌లో బడ్జెట్‌ను సమతుల్యం చేయడం పెద్ద సవాలుగా మారనుంది.

# కేంద్రం కొత్త కొరడా!

**మొదటి పేజీ తరువాయి**

కానీ ఇప్పుడు అలా కాదు. తాజాగా కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. కానీ, విడుదల చేయదు. రాష్ట్రం తన వాటా నిధులు ఖర్చు చేసి యూటిలైజేషన్ సర్టిఫికేట్ (యూసీ) సమర్పించాకే కేంద్రం తన వంతు వాటా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. ఇలా చేయడం వలన కేంద్రం రూపొందించిన పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, అవి ఆచరణలోనే ఉన్నాయని తెలిశాకే నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది.

కేంద్రం నిధులు.. రాష్ట్రాలకు క్రెడిట్..


2014 ప్రారంభంలో కేంద్రం నుంచి నిధులు రావడం, అవి ఏ పథకాలకు ఖర్చు చేశారనేదానిపై జవాబుదారి లేకపోవడం, నిధులు ఇచ్చిన ఏండ్ల తర్వాత యూసీలు సమర్పించే ఆనవాయితీ ఉండేది. దీంతో నిధులు విడుదల చేస్తున్న రాష్ట్రాలకు మాత్రమే క్రెడిట్ దక్కేది. కేంద్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో క్రెడిట్ రావడం లేదని అనేక ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. కేంద్ర పథకాలు, వాటి లక్ష్యం నీరు గారేవి. ఫలితంగా వివిధ రాష్ట్రాల్లో కేంద్రానికి రాజకీయంగానూ ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యేవి. రాష్ట్రాలు మాత్రం కేంద్రం మంజూరు చేసే నిధులను తమ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేవి. తమ ఆర్థిక అవసరాలకు సర్దుబాటు చేసుకునేవి. కేంద్రం నిధులు వాడుకుని యూసీ మాత్రం ఆర్థిక సంవత్సరం చివర్లో సమర్పించేవారు. ఫలితంగా నిధులు దారి మళ్లుతున్నాయని కేంద్రం గుర్తించింది. నిధుల డైవర్షన్‌కు చెక్ పెట్టేందుకు ప్రతి పథకానికి ప్రత్యేక అకౌంట్లను ఏర్పాటు చేసింది. ఆయా ఖాతాల్లో రాష్ట్రాలు ముందుగా తమ వాటాను జమ చేసిన తర్వాత కేంద్రం తన వాటాను జమ చేసేది. ఇలా కొన్ని సంవత్సరాలు చేసిన కేంద్రం.. ఇందులోనూ నిధుల డైవర్షన్ జరుగుతోందని గుర్తించింది. కొంత నిధుల దుర్వినియోగం, పక్కదారి పడుతున్నాయని ఫిర్యాదులు అందడంతో తాజాగా కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

కేంద్రం నిధుల పూర్తి వినియోగంపై సీఎం ఫోకస్

రాష్ట్రంలో కాంగ్రెస్? ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం అందించే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్?అధికారులను ఆదేశించారు. పదే పదే ఈ విషయాన్ని చెబుతూ వచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు రూ.20 వేల కోట్ల వరకు నిధులు రావచ్చని అంచనా వేశారు. ఇప్పటికే రూ.5 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసింది. దీంట్లో ఇప్పటివరకు రూ.3 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో కేంద్రం నుంచి మంజూరైన నిధులు ఖర్చు చేయడంలో వెనకబడ్డామని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ నిధులను పూర్తిగా వినియోగించుకుంటే ఇంకా నిధులు వస్తాయని భావిస్తోంది.

కొన్ని శాఖల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధుల వినియోగం వేగంగా జరగడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. కేంద్రం విడుదల చేసే నిధులపై ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అనుకున్నంత స్థాయిలో పనులు వేగంగా జరగకపోవడం వల్ల నిధులు పూర్తిగా వినియోగించలేదని తేలింది. మరింత పర్యవేక్షణ, అనుమతులు, సమీక్షలు క్రమంగా జరిపితే ఫలితం ఉంటుందని ఉన్నతాధికారులు ఒక అంచనాకు వచ్చారు. కేంద్రం నుంచి ఎక్కువగా వైద్యారోగ్య శాఖ, ఆర్ అండ్ బీ, పరిశ్రమల శాఖ, రెన్యువబుల్?ఎనర్జీ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పర్యాటకం, అటవీశాఖ తదితర శాఖలకు నిధులు అధికంగా వస్తుంటాయి. ఆ శాఖల్లో నిధుల వినియోగంపై ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు అలర్ట్ చేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

# వందేమాతరం బిల్లు పాస్!




**న్యూస్ డెస్క్, 29 జూలై (ఇది కద నిజం):** జాతీయ గీతం 'జనగణమన..' స్థాయిలో వందేమాతరం గేయానికి చట్టపరమైన రక్షణలు కల్పించే దిశగా కీలక అడుగు పడింది. వందేమాతరంపై బిల్లును బుధవారం రాజ్యసభ ఆమోదించింది. సుదీర్ఘ చర్చ అనంతరం ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకు ముందు ఈ బిల్లుపై చర్చ అనంతరం విపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. కాగా 'వందేమాతరం'ను అవమానించడాన్ని నేరంగా పరిగణించే ఈ బిల్లును హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే జైలు శిక్ష పడేలా బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. అయితే, ఈ బిల్లుపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభ పలు మార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఎట్టకేలకు ఆమోదం పొందింది.

# ఓటు హక్కును కాపాడుకోండి చివరి నిమిషం వరకు ఆగకండి

## : సేవెళ్ళ మహేందర్ పిలుపు








ఇది కద నిజం, అత్తాపూర్ : అత్తాపూర్, హైదర్ గూడ డివిజన్లలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టిన ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మండల 24 గంటల ప్రవాస్ యోజన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా ప్రభారీ, రాష్ట్ర యువమోర్చా పూర్వ అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్ అత్తాపూర్ మరియు హైదర్ గూడ డివిజన్ల పరిధిలోని సుమారు 40 బూత్‌లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ హెల్ప్ డెస్క్‌లను ఆయన పరిశీలించి, ఓటరు నమోదు ప్రక్రియను సమీక్షించారు. అనంతరం మహేందర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్ మరియు బీజేపీ క్రియాశీల సభ్యురాలు సాబాద స్వప్న నివాసంలో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడూ తమ ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సకాలంలో నింపి సమర్పించడం ద్వారా ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా వీలైనంత త్వరగా ఫారమ్‌లను అందజేయాలని, లేకపోతే ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటివరకు ఫారమ్‌లు అందని వారు తమ ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డుతో వస్తే, ఏ బి.ఎల్.ఓ. వద్ద ఫారమ్ ఉందనే వివరాలను కార్యకర్తలు యాప్ ద్వారా పరిశీలించి సహాయం అందిస్తారని తెలిపారు. అలాగే, ప్రస్తుతం ఫారమ్‌లు తిరిగి ఇచ్చిన వారికి మాత్రమే ఆగస్టు 10వ తేదీ తర్వాత మార్పులు, చేర్పులు మరియు కరెక్షన్స్ చేసుకునే అవకాశం లభిస్తుందని స్పష్టం చేశారు. ఓటర్లకు ఎటువంటి సందేహాలు ఉన్నా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల ద్వారా నివృత్తి చేసుకోవచ్చని, బీజేపీ నాయకులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోంగ్ర కొమురయ్య, డివిజన్ బీజేపీ అధ్యక్షులు సులిగె వెంకటేష్, కాడెం సుధాకర్, సుదర్శన్ ప్రసాద్ తివారి, ఎస్. జయానంద్ రెడ్డి, కాకులారం కృష్ణ, కే. కిరణ్ చారి, పి. వెంకట్ రెడ్డి, విజయ్ స్వామి, బీట్కూరి సతీష్, జి. అమర్ నాథ్ రెడ్డి, ఎస్. వాసు, శశికాంత్ శర్మ, మిద్దెల సరిత, విజయలక్ష్మి, బి.ఎల్.ఏ. నారగూడెం సోమ్ నాథ్ రెడ్డి, ఎస్. మణికంఠ, శివ రాజ్ గౌడ్, వంశీ, తాటి రాజు, కైల రవీందర్ రెడ్డి, సులిగే శ్రీనివాస్, ఎన్. విశ్వనాథ్ రెడ్డి తదితరులతో పాటు బి.ఎల్.ఓ.లు నిషిత, ప్రభు గౌడ్, మౌనిక, శోభన్, అనురాధ మరియు బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిట్లంలో భక్తిశ్రద్ధలతో

## సాయిబాబా గురుపౌర్ణిమ మహోత్సవం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా మందిరంలో బుధవారం గురుపౌర్ణిమ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్లు ఎస్.ఐ.ఆర్. పత్రాలను సకాలంలో సమర్పించాలి

## : మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ మహేందర్





ఇది కద నిజం, అత్తాపూర్ :అత్తాపూర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్.ఐ.ఆర్. ప్రవాస్ అభియాన్ యోజన 24 గంటల కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువమోర్చా పూర్వ అధ్యక్షులు మరియు ప్రస్తుత మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ మహేందర్ విచ్చేశారు. పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సాయంత్రం ముఖ్య నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం కార్యకర్త ఇంట్లోనే భోజనం చేసి అక్కడే బస చేశారు. మరుసటి రోజు అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని సుమారు 30 బూత్‌లలో పర్యటించి, ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్. పత్రాల సేకరణ మరియు అందజేసే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఓటరు నమోదు మరియు సవరణ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఎస్.ఐ.ఆర్. పత్రాలను తప్పకుండా బి.ఎల్.ఓ. లకు తిరిగి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమరయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుధాకర్, జిల్లా ఆఫీస్ కార్యదర్శి విజయ్ కుమార్, జయానంద రెడ్డి, వెంకట్ రెడ్డి, శశికాంత్ శర్మ, స్టార్ చిన్న, కాకులారం కృష్ణ, అమర్ రెడ్డి, శివరాజ్ గౌడ్, మణికంఠ, లక్ష్మీకాంత్ రెడ్డి, సరిత రెడ్డి, విజయ రెడ్డి, కాంచన జోషి, రేఖ, ఉమ, బీట్కూర్ సతీష్, సుల్గే శ్రీనివాస్, ప్రవీణ్ చంద్, రంజిత్ సింగ్, గురుప్రీత్ సింగ్, పవన్, బాలకృష్ణ తదితర నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిట్లంలో విషాదం..

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం గ్రామానికి చెందిన దయ్యపు ఆనంద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల కేంద్రంలోని ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆనంద్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో పిట్లం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గురు పౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి ఘన నివాళి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురు పౌర్ణమి సందర్భంగా వేదవ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఆచార్యులు, పాఠశాల కమిటీ సభ్యులు వేదవ్యాస మహర్షి చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళు లర్పించారు. విద్వత్ సమితి కన్వీనర్ ఉడుగుల రాము మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువుల మార్గదర్శనంతోనే జ్ఞానం పొంది ఉన్నత వ్యక్తులుగా ఎదగవచ్చని తెలిపారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్, స్వామి వివేకానంద వంటి మహనీయులు గురువుల బోధనలతోనే మహోన్నతులుగా నిలిచారని వివరించారు. విద్యార్థులు గురువులను ఆదర్శంగా తీసుకుని మంచి వ్యక్తులుగా ఎదిగి సమాజ సేవకు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు గీత, ఆచార్యులు, మాతాజీలు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్జున్ పహిల్వాన్ ఆశీస్సులే నా విజయ రహస్యం

## : మల్లయోధుడు రాజు పహిల్వాన్





ఇది కద నిజం, హైదరాబాద్ : మట్టిలో మనుగడ సాగిస్తూ, ఎంతోమంది యువకులను గొప్ప మల్లయోధులుగా తీర్చిదిద్దిన ప్రముఖ గురువు అర్జున్ పహిల్వాన్ సేవలు దేశానికే గర్వకారణమని ప్రసిద్ధ మల్లయోధుడు రాజు పహిల్వాన్ కొనియాడారు. బుధవారం తన గురువుకి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్జున్ పహిల్వాన్ కేవలం ఒక శిక్షకుడు మాత్రమే కాదని, మల్లరంగంలో తన ప్రాణాలను, సర్వస్వాన్ని ధారపోసిన మహోన్నత గురువని ఆయన భావోద్వేగంతో తెలిపారు. ఈ సందర్భంగా రాజు పహిల్వాన్ తన గురువుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఎన్నో అపురూప విషయాలను పంచుకున్నారు. “నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే, సమాజంలో నాకు దక్కిన గుర్తింపునకు పూర్తిగా నా గురువు అర్జున్ పహిల్వాన్ ఆశీస్సులే కారణం” అని ఆయన తెలిపారు. అఖాడాలో సాధన చేసే సమయంలో కేవలం మెలకువలు నేర్పడమే కాకుండా, జీవితంలో ఎలా నిలబడాలో, క్రమశిక్షణతో ఎలా బ్రతకాలో నేర్పిన నిజమైన మార్గదర్శి ఆయన అని రాజు పహిల్వాన్ కొనియాడారు. ప్రస్తుత తరంలో కుస్తీ క్రీడ కనుమరుగైపోతున్న తరుణంలో, ఎలాంటి ఆశలు లేకుండా యువతను సన్మార్గంలో నడిపించడానికి అర్జున్ పహిల్వాన్ పడ్డ శ్రమను ఆయన గుర్తుచేశారు. ఎముకలు కొరికే చలిలో అయినా, ఎండలో అయినా శిష్యులకు అండగా నిలబడి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దిన త్యాగధనుడు ఆయన అని కొనియాడారు. గురువు అందించిన ఆశీస్సులు, నేర్పిన విద్యే తన విజయాలకు పునాది అని రాజు పహిల్వాన్ స్పష్టం చేశారు. ముగింపుగా, గురువు పట్ల భక్తి ప్రపత్తులను చాటుకుంటూ తాము ఎప్పటికీ ఆయన అడుగుజాడల్లోనే నడుస్తామని రాజు పహిల్వాన్ పునరుద్ఘాటించారు. అర్జున్ పహిల్వాన్ ఆశీస్సులు ఎల్లప్పుడూ తమపై ఉంటాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తాము గురువుకు అర్పించే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు. నేటి యువత కూడా గురుభక్తిని కలిగి ఉండి, సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# లైంగిక వేధింపుల కేసు.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్



హైదరాబాద్: ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆగస్ట్ 11 వరకు ఆయనకు రిమాండ్ విధిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బుధవారం ఉదయం సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ఉదయ్‌ను పోలీసులు అశోక్‌నగర్ తీసుకెళ్లారు. ఆయన ఉంటున్న గదిని అత్తాపూర్ సీఐ సీతయ్య పరిశీలించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని మంగళవారం రాత్రి హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

**కేసు నేపథ్యమిదీ..**

ఈ నెల 18న తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న దర్యాప్తు చేపట్టారు. జాతీయ పోలీసు అకాడమీలో బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా మెడ, గొంతు నులిమినట్లు ఆనవాళ్లు.. చెంప భాగంలో కమిలిన గాయాలు, ఎడమ కాలిపై దెబ్బలున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

నిందితుడికి పోలీసులు నోటీసులిచ్చేందుకు హైదరాబాద్‌లోని రెండు చిరునామాల్లో ప్రయత్నించగా దొరకలేదు. దీంతో 4 బృందాలను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఒంగోలులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి కర్ణాటకకు ప్రయాణమైనట్లు గుర్తించి మరో బృందం అక్కడకు వెళ్లింది. మరో రెండు బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టాయి. ఈక్రమంలో మంగళవారం మిర్యాలగూడ సమీపంలో ఉదయ్‌కృష్ణారెడ్డి ఉన్నట్లు గుర్తించారు. ఆయన వాహనాన్ని పోలీసులు అనుసరిస్తూ హైదరాబాద్‌కు చేరగానే అదుపులోకి తీసుకున్నారు.

# జలసిరి విజయానికి ప్రజల భాగస్వామ్యం అవసరం: సర్పంచ్ సుజాత



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలసిరి కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కంబాపూర్ గ్రామ సర్పంచ్ సుజాత పిలుపునిచ్చారు. ఆమె ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జలసిరి ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రతి ఊరికి ఊటకుంటలు, ప్రతి పొలానికి వ్యవసాయ కుంటలు ఏర్పాటు చేయాల్సిన అవసరంపై చర్చించారు. అలాగే గ్రామ పరిశుభ్రతను కాపాడుతూ నీటి వృథాను నివారించాలని గ్రామస్థులకు సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామంలో నీటి వనరులను సంరక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో భారీగా పోలీసు ఉద్యోగాల భర్తీ.. 7,437 పోస్టులకు నోటిఫికేషన్లు





హైదరాబాద్: తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ tgprbను సందర్శించాలని సూచించింది.

# సినిమా న్యూస్

## ‘రామాయణ’ ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్!

ప్రపంచ వ్యాప్తంగా సినిమా లవర్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న ప్రాజెక్టులలో ‘రామాయణ’ ఒకటి. నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ మూవీ ట్రైలర్‌పై ఎట్టకేలకు అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు.. ‘శుభప్రదమైన బ్రహ్మ ముహూర్తంలో, 30 జులై 2026న మా ట్రైలర్‌తో రామాయణ ఆరంభానికి స్వాగతం పలుకుతున్నాము.. గురువారం ఉదయం4:15 గంటలకు ప్రపంచవ్యాప్తంగా ట్రైలర్ రాబోతున్నది సిద్ధంగా ఉండండి’ అంటూ ఓ పోస్ట్ షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, కైకేయిగా లారా దత్తా, లక్ష్మణుడిగా రవి దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, దశరథుడిగా అరుణ్ గోవిల్ నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో.. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం మొదటి భాగం ఈ ఏడాది దీపావళి కానుకగా, రెండవ భాగం 2027 దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు మేకర్స్.




## తక్కువ బడ్జెట్ భారీ టార్గెట్!

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం ‘స్పిరిట్’ గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే.

అయితే తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, ‘స్పిరిట్’ టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి.

ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బడ్జెట్ సినిమాలతో పోలిస్తే ‘స్పిరిట్’ అత్యంత తక్కువ బడ్జెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.



## స్టైలిష్ లుక్‌లో రామ్

రామ్ పోతినేని హీరోగా నటిస్తూ తొలిసారి మెగా ఫోన్ చేపట్టి తెరకెక్కిస్తున్న చిత్రం ‘RAPO23’ (వర్కింగ్ టైటిట్). ఈ సినిమాను రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మాణంలో భారీ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతే కాకుండా.. రామ్ కెరీర్‌లోనే ఈ సినిమా అత్యధిక బడ్జెట్‌తో పాటు ఆయన స్వీయ డైరెక్షన్‌లో రాబోతుండగా.. అభిమానులతో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఇదిలా ఉంటే.. ఈ మూవీ కోసం రామ్ పోతినేని ఫుల్ మేకోవర్ అయినట్లు తెలుస్తోంది. బాడీ లాంగ్వేజ్‌తో పాటు హెయిర్ స్టైల్‌లో కూడా మార్పులు చేసుకున్నాడట. అయితే.. తాజాగా రామ్‌కు సంబంధించిన కొన్ని క్రేజీ న్యూ పిక్స్ నెట్టింట దర్శనమిచ్చాయి. ఇందులో రామ్ చాలా స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. అలాగే ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ త్వరలో స్టార్ట్ కాబోతుందని తెలుపుతూ పంచుకున్న ఈ ఫొటోస్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.






## మాస్ అవతార్‌లో ధనుష్!

తమిళ్ స్టార్ హీరోలలో ఒకరైన ధనుష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 55వ చిత్రం ‘ఓం - చాప్టర్ 1: ఉధిరమ్ - ది బ్లడ్ వుడ్’ నుంచి తొలి పాట ‘అలాకా లూవా’ను చిత్రబృందం విడుదల చేసింది. విడుదలైన కొద్ది సేపటికే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. మాస్ బీట్స్, ఎనర్జిటిక్ వోకల్స్, ధనుష్ స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఈ పాటకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరాలు సమకూర్చడమే కాకుండా స్వయంగా ఆలపించారు. తెలుగు వెర్షన్‌లో రామ్ మిరియాల, అరుణ్ కౌండిన్య గాత్రం అందించగా.. ప్రముఖ గేయరచయిత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు. మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా రూపొందించిన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

ఇటీవల విడుదలైన ‘ఫస్ట్ స్ట్రైక్’ టీజర్ కూడా మంచి స్పందన అందుకుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్ మాస్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవితో ధనుష్ ‘మారి 2’ తర్వాత మరోసారి జతకడుతున్నారు. శ్రీలీల కూడా కీలక పాత్రలో కనిపించనుంది. ‘అమరన్’ విజయంతో గుర్తింపు పొందిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్-టేక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 16న విజయదశమి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఫ్యాన్స్‌కు బన్నీ బిగ్ గిఫ్ట్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానుల పట్ల ఉన్న అంతులేని ప్రేమాభిమానాలను మరోసారి చేతల్లో చూపించాడు. కేవలం తెరపైనే కాకుండా, నిజ జీవితంలోనూ తమను ఆదరించే అభిమానుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన ఒక అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ వేదికగా ఘనంగా జరిగిన ‘అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్’ వార్షిక సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర సహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా ఫ్యాన్ అసోసియేషన్ ప్రముఖులు, ప్రధాన నాయకులు అత్యంత ఉత్సాహంగా హాజరయ్యారు.



అయితే ఈ ప్రత్యేక వేదికపై అల్లు అర్జున్ ఏడు రాష్ట్రాల నుంచి విచ్చేసిన తన అభిమానులందరికీ ఎటువంటి సభ్యత్వ రుసుములు లేకుండా, పూర్తిగా ఉచిత ప్రమాద బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ గొప్ప సంక్షేమ పథకం కింద రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులకు రూ. 5 లక్షలు, అలాగే జిల్లా స్థాయి కమిటీ సభ్యులకు రూ. 3 లక్షల వరకు ప్రమాద బీమా కవరేజ్ లభించనుంది. అంతేకాకుండా, ఈ బీమాకు సంబంధించిన అధికారిక కార్డులను స్వయంగా తన చేతుల మీదుగా అభిమానులకు అందించి వారిలో సరికొత్త జోష్ నింపారు.

సినిమాల సక్సెస్‌లను పంచుకోవడమే కాకుండా, కష్టసుఖాల్లోనూ తన అభిమానుల కుటుంబాల భద్రత మరియు భవిష్యత్తు ఎంతో ముఖ్యమని భావించి బన్నీ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయంపై ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ ప్రశంసల వర్షం కురుస్తోంది. కేవలం రీల్ హీరోగానే కాకుండా తన ఆర్మీకి నిజమైన రక్షణ కల్పిస్తున్న అల్లు అర్జున్‌ను నెటిజన్లు, అభిమానులు ‘అసలైన రియల్ హీరో’ అంటూ ఎంతో గర్వంగా కొనియాడుతున్నారు.

